క్లుప్తంగా

గ్రామపంచాయతీ చేయొద్దంటూ ధర్నా



ధర్నా చేస్తున్న తాళ్ళల్లపల్లి గ్రామస్తులు

ఇల్లంతకుంట: మండలంలోని రేపాక గ్రామపంచాయతీ నుంచి తాళ్ళల్లపల్లి గ్రామాన్ని విడదీసి నూతన పంచాయతీగా ఏర్పాటు చేయొద్దంటూ మండలంలోని తాళ్ళల్లపల్లి గ్రామస్తులు మంగళవారం రేపాక గ్రామపంచాయతీ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేపాక పంచాయతీ నుంచి 9, 10 వార్డులను విభజించి తాళ్ళల్లపల్లి నూతన పంచాయతీగా ఏర్పాటు చేయాలనే కుట్రలు జరుగుతున్నాయని, అగ్రవర్ణ కులాల కుట్రలను తిప్పికొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, నాగలక్ష్మి, యాదగిరి, లక్ష్మణ్, శ్రీనివాస్, ఓజయ్య, లక్ష్మణ్, రాములు, శంకర్, శ్రీనివాస్, ప్రవీణ్ పాల్గొన్నారు.

గీత కార్మిక కుటుంబాలకు ఆర్థికసాయం అందించాలి



బుర్ర వెంకటేశంగౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న అమరగాని శ్రీనివాస్, మల్లేశంగౌడ్

సిరిసిల్లఅర్బన్: ప్రమాదవశాత్తు తాటి, ఈత చెట్లపై పడి మరణించిన, తీవ్రగాయాల పాలైన గీత కార్మికుల కుటుంబాలకు తక్షణ ఆర్థికసాయం అందించాలని రాష్ట్ర గోపా ఉపాధ్యక్షుడు అమరగాని శ్రీనివాస్‌గౌడ్, సంపూనూరి మల్లేశంగౌడ్, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశంగౌడ్‌కు వినతిపత్రం అందించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు చెందిన అనేక మంది గీత కార్మికులు వృత్తిలో భాగంగా తాటి, ఈత చెట్లపై నుంచి పడి మరణించారని, తీవ్రగాయాల పాలై మంచానికే పరిమితమయ్యారన్నారు. వీరందరికీ తాడి కార్పొరేషన్ ద్వారా అందించే వైద్య ఖర్చులను తక్షణమే అందేలా చర్యలు తీసుకోని, బాధిత కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రైతులకు సకాలంలో రుణమాఫీ చేయాలి



మాట్లాడుతున్న ఎగమంటి ఎల్లారెడ్డి

వేములవాడఅర్బన్: ప్రభుత్వం రైతులకు సకాలంలో రుణమాఫీ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎగమంటి ఎల్లారెడ్డి అన్నారు. వేములవాడ పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అయన మాట్లాడుతూ రైతులకు సకాలంలో రుణమాఫీ కాకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రభుత్వం తొమ్మిదేళ్ల క్రితం రైతులకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటికీ కూడా నేరవేర్చలేదన్నారు. ఎన్నికలు రావడంతోనే రైతు రుణమాఫీ గుర్తుకు వచ్చిందా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వానికి రైతుల మీద చిత్తశుద్ధి ఉంటే వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగరాజు, శ్రీధర్, అశోక్, సురేశ్, బాబు పాల్గొన్నారు.

నియామకం



ఉత్తర్వులు అందిస్తున్న ప్రతాపరామకృష్ణ

సిరిసిల్లటౌన్: బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా బర్కం నవీన్‌యాదవ్ నియమితులయ్యారు. మంగళవారం ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాపరామకృష్ణ ఉత్తర్వులు అందజేశారు. తన నియామకానికి సహకరించిన జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, మాజీ ఎమ్మెల్యే కటుకం మృత్యుంజయం, సీనియర్ నాయకుడు గరిపెల్లి ప్రభాకర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మైనార్టీల విదేశీ విద్యకు ఆర్థికసాయం

సిరిసిల్లకల్చరల్: విదేశాల్లో విద్యాభ్యాసం చేసే మైనార్టీ విద్యార్థులకు ప్రభుత్వం ఆర్థికసాయం చేసేందుకు నిర్ణయించింది. చీఫ్ మినిస్టర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం కింద విదేశాల్లోని విశ్వవిద్యాలయాల్లో పోస్టు గ్రాడ్యుయేషన్, పీహెచ్‌డీ వంటి కోర్సుల్లో చేరినవారు ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి బి.గంగయ్య ప్రకటనలో తెలిపారు. www.telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో సెప్టెంబర్ 21లోపు తమ వివరాలను పొందుపరచాలన్నారు. పూర్తి వివరాలకు 99497 71639 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సిరిసిల్లలో నిరసనల హోరు

దద్దరిల్లిన కలెక్టరేట్, అంబేడ్కర్ చౌరస్తాలు



అంబేడ్కర్ చౌరస్తాలో బతుకమ్మ ఆడుతున్న రెండో ఏఎన్ఎంలు

సిరిసిల్లటౌన్: నిరసనలు, నినాదాలతో జిల్లా కేంద్రం దద్దరిల్లింది.మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పట్టణంలో నిరసనలు హోరెత్తాయి. వడ్డెర కులస్తులు, ఏబీవీపీ, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, భీం ఆర్మీ సంఘాల ఆధ్వర్యంలో ఆశావర్కర్లు కలెక్టరేట్‌ను ముట్టడించారు. అంబేడ్కర్ చౌరస్తాలో రెండో ఏఎన్ఎంలు బతుకమ్మ ఆడి, మాజీ సర్పంచులు వేర్వేరుగా నిరసన దీక్షలు చేపట్టారు.

కళాశాల ఎత్తివేయొద్దు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలను అగ్రహారం నుంచి ఎత్తివేయొద్దని ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు మారవేని రంజిత్‌కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అంగూరి రంజిత్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా రాస్తారోకో నిర్వహించి, ఆఫీసు ముందు ధర్నా అనంతరం కలెక్టర్ ఆఫీసులో వినతిపత్రాన్ని అందించారు. ఏబీవీపీ నాయకులు కావ్య, సంజన, భవాని, యమున, సహారిక, రాజేశ్, సాయి, చరణ్, ఎస్ఎఫ్ఐ వేణు, రాకేశ్, సంజన, భీం ఆర్మీ నాయకులు దొబ్బల ప్రవీణ్‌కుమార్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి నాగరాజు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

రెండో ఏఎన్ఎంలు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ చౌరస్తాలో బతుకమ్మ ఆడుతూ నిరసనలు హోరెత్తించారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ కంచర్ల రవిగౌడ్, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామల మల్లేశం, నాయకులు కడారి రాములు సంఘీభావం తెలిపారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏడోరోజు దీక్షలు చేస్తున్న రెండో ఏఎన్ఎంలను డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ మంగళవారం కలిసి సంఘీభావం తెలిపారు. వారి సమస్యలు పరిష్కారం అయ్యేవరకు కాంగ్రెస్ అండగా నిలుస్తుందన్నారు.

వడ్డెరుల పొట్ట కొట్టొద్దు

గుట్టకు రాళ్లకొట్టుకుంటూ బతుకులు వెళ్లదీస్తున్న తమ పొట్ట కొట్టొద్దని వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ కోరారు. పెద్దూరు శివారులో ఎల్లమ్మ గుట్టమీద ఉపాధి కోసం హక్కులు కల్పించాలని కోరుతూ మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి మాట్లాడారు. గ్రామంలో స్పిన్నింగ్ మిల్లు పక్కన గల గుట్టలను కొందరు ఎలాంటి పర్మిషన్ లేకుండా కొడుతున్నారని వారికి అధికారులు వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. కార్యక్రమానికి షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకల కమలాకర్ సంఘీభావం తెలిపారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో ముదిరాజ్‌లకు ప్రాధాన్యత ఇవ్వాలి

- ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పర్శ హన్మాండ్లు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పర్శ హన్మాండ్లు

సిరిసిల్లటౌన్: రాబోయే ఎన్నికల్లో నామినేటెడ్ పోస్టుల్లో బీసీల్లో అధిక జనాభా కలిగిన ముదిరాజ్‌లకు ప్రభుత్వం, అన్ని పార్టీలు ప్రాధాన్యత ఇవ్వాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పర్శ హన్మాండ్లు కోరారు. ముదిరాజ్ ప్లీనరీ సమావేశాల పోస్టర్లను మంగళవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించి మాట్లాడారు. బీసీ–డీ గ్రూపు నుంచి ముదిరాజ్‌లను బీసీ–ఏ గ్రూపులోకి మార్చాలని, ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని కోరారు. ముదిరాజ్‌ల హక్కుల సాధన, భవిష్యత్తు కార్యాచరణకై ఈనెల 25న హైదరాబాద్ బేగంపేటలోని పైగా ప్యాలెస్‌లో జరిగే ప్లీనరీకి జిల్లా నుంచి పెద్ద ఎత్తున కులబాంధవులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు కోడి అంతయ్య, బల్ల సత్తయ్య, చిగురు నరేశ్, రాయిని ప్రతాప్, శంకర్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఉజ్వల సొసైటీలో ఖాతాదారుల లొల్లి



నిర్వాహకులను నిలదీస్తున్న ఖాతాదారులు

వేములవాడ: వేములవాడ పట్టణం మల్లారం రోడ్డులో గల ఉజ్వల సొసైటీ నిర్వాహకులపై మంగళవారం ఖాతాదారులు గొడవకు దిగారు. ఖాతాదారులు శ్రీనివాస్, జగదీశ్ వివరాల ప్రకారం .. ఆరు మాసాలుగా రోజూ రూ.500, రూ.200 చొప్పున ఖాతాదారుల వద్ద వసూలు చేసి మెచ్యూరిటీ పూర్తయినా డబ్బులు ఇవ్వకుండా ముఖం చాటేస్తున్నారన్నారు. మంగళవారం స్థానిక బ్రాంచ్‌కు సదరు నిర్వాహకులు వచ్చారన్న సమాచారం తెలుసుకుని వెళ్లి డబ్బు తిరిగి చెల్లించాలని నిలదీసినట్లు తెలిపారు. ఈ క్రమంలో ఖాతాదారులు, నిర్వాహకులకు మధ్య గొడవ జరిగింది. సీఐ కరుణాకర్ ఆధ్వర్యంలో పోలీసులు రంగప్రవేశం చేశారు. ఖాతాదారులతో మాట్లాడి నిర్వాహకులను ఠాణాకు తరలించి విచారిస్తున్నట్లు తెలిసింది.

సీసీ కెమెరాకు చిక్కిన కోళ్ల దొంగలు



సీసీ కెమెరాకు చిక్కిన కోళ్ల దొంగ

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని నాటుకోళ్ల ఫారంలో కోళ్లను ఎత్తుకెళ్తూ ఇద్దరు దొంగలు సీసీ కెమెరాలకు చిక్కారు. కోళ్ల వ్యాపారి జొగ్రీగల వినయ్ వివరాల ప్రకారం.. మంగళవారం వేకువజామున 4 గంటల సమయంలో ఇద్దరు దొంగలు ఫారంలోకి చొరబడ్డారు. వెంట తెచ్చుకున్న సంచినిండా కోళ్లను నింపుకుని పరారయ్యారు. ఫారంలో సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. కానీ అప్పటికే వాళ్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యారు. గతంలో రెండుసార్లు ఇలాగే కోళ్లను ఎత్తుకెళ్లారని ఇది మూడోసారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు.

వ్యభిచారం కేసులో నిందితుడికి జైలు

- మిగతా ఇద్దరిపై కేసు కొట్టివేత

వేములవాడ: వ్యభిచారం కేసులో తోట సందీప్‌కు వేములవాడ సబ్ జడ్జి సట్టు రవీందర్ జైలుశిక్ష విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ గౌరు రాజిరెడ్డి వివరాల ప్రకారం.. వేములవాడ మున్సిపల్‌లో క్యాజువల్ స్వీపర్‌గా పనిచేస్తున్న మహిళను బైపాస్‌రోడ్డులోని బాలానగర్ ప్రాంతంలో సాయిరక్ష దాబా వద్దకు వ్యభిచరించేందుకు తోట సందీప్, ఆలకుంట రాజు, చింతల మహేశ్ రమ్మనడంతో ఆమె వెళ్లింది. అక్కడికి వెళ్లిన మహిళకు మద్యం తాగించారు. ఈ క్రమంలోనే ఆప్రాంతానికి ప్రజలు, పోలీసులు రావడంతో ఆమెను వదిలేసి ముగ్గురు పారిపోయారు. సదరు మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై టౌన్ సీఐ వెంకటస్వామి కేసు నమోదు చేశారు. ఈ కేసులో జడ్జి రవీందర్ సాక్ష్యాధారాలు పరిశీలించి తోట సందీప్‌కు ఆరునెలల జైలు లేదా రూ.5 వేల జరిమానా విధించారు. మిగతా ఇద్దరిపై నేరం నిరూపణ కాకపోవడంతో వారిపై కేసు కొట్టివేస్తూ తీర్పునిచ్చారు.

సర్పంచ్‌పై విచారణ జరపండి

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని వట్టెంల గ్రామ సర్పంచ్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన మొగిలి కరుణాకర్ మంగళవారం డీపీవోకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గ్రామంలో పలు అవకతవకలతో పాటు అవినీతికి పాల్పడినట్లు గతంలో కూడా ఫిర్యాదులు వచ్చాయని, వీటిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన ఫిర్యాదులో తెలిపారు. ఈ విషయంపై సర్పంచ్ సుమతిని వివరణ ఇస్తూ గతంలో ఇచ్చి ఫిర్యాదుపై విచారణ జరిపారని ఎలాంటి అవకతవకలు జరగలేదని, రాజకీయ కక్షలతోనే ఆరోపణలు చేస్తున్నారని ఆయన తెలిపారు.

చైర్‌పర్సన్ కలిసిన ట్రేడర్

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల ఏఎంసీ ట్రేడర్‌గా నియమించబడ్డ కట్కం శ్రీనివాస్ మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు చక్రపాణిని మర్యాదపూర్వకంగా కలిశారు.

పద్నాలుగో రోజుకు దీక్షలు

సిరిసిల్లటౌన్: మాజీ సర్పంచుల సమస్యల పరిష్కారం కోరుతూ మంగళవారం 14వ రోజు రిలేదీక్షలు చేపట్టారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేవరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. దీక్షలకు రాజకీయ పార్టీల నేతలు సంఘీభావం తెలిపారు. బొడ్డు దేవయ్య, బండ సత్తయ్య, గోవర్దన్, కాంతయ్య, లక్ష్మణ్, పర్శయ్య, అశోక్, రాంచంద్రం, రాజారెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు షూ పంపిణీ

బోయినపల్లి: మండలంలోని మల్లాపూర్ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం గ్రామానికి చెందిన దాసరి బాబు అనే యువకుడు షూ పంపిణీ చేశాడు.

రాజబహదూర్ ఆదర్శప్రాయుడు

- రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి
- ఆవునూర్‌లో విగ్రహావిష్కరణ



ఆవునూర్‌లో విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ముస్తాబాద్: రాజ బహదూర్ వెంకటరాంరెడ్డి సమాజానికి ఆదర్శప్రాయుడని రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కూర అంజిరెడ్డి అన్నారు. మండలంలోని ఆవునూర్‌లో ఆయన 154వ జయంతి సందర్భంగా రెడ్డి రైతు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహన్ని మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. అణగారిన వర్గాలతోపాటు పేద ప్రజల అభివృద్ధి కోసం రాజబహదూర్ ఎంతో కృషి చేశారన్నారు. నేటి యువత ఆయన మార్గంలో పయనించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే వుచ్చిడి మోహన్‌రెడ్డి, సర్పంచ్ కల్యాణిరెడ్డి, రెడ్డి సంఘం మండల అధ్యక్షుడు కుంబాల మల్లారెడ్డి, గ్రామసంఘం అధ్యక్షుడు ఇర్రి బాల్‌రెడ్డి, ఎంపీపీ శరత్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, రెడ్డి సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు చక్రధర్‌రెడ్డి, ఎంపీటీసీ లలిత, శ్రీనివాస్‌రెడ్డి, పద్మారెడ్డి, భానుచందర్ రెడ్డి, క్రాంతి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని నేవూరి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, సంఘం ఉపాధ్యక్షులు గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో రెడ్డి సంఘం మండల అధ్యక్షుడు ఏసిరెడ్డి రాంరెడ్డి, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణారెడ్డి, జిల్లా రెడ్డి సంఘం ప్రచారం కార్యదర్శి ఎడమల హనుమంతరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు కల్లెపల్లి తిరుపతిరెడ్డి, మహిళా కార్యదర్శి గడప మానస, గ్రామ రెడ్డి సంఘం అధ్యక్షుడు ఎడమల బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండల కేంద్రంలో జాతీయ అవార్డు గ్రహీత, ఎల్లారెడ్డిపేట సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డికి, ఏఎంసీ చైర్మన్ కొత్తింటి హన్మంతరెడ్డికి సన్మానం చేశారు. కార్యక్రమంలో మండలరెడ్డి సంఘం అధ్యక్షుడు గడ్డమీది శ్రీకాంత్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు అక్కపల్లి రాజనర్సింహారెడ్డి, మండల సర్పంచుల ఫోరం కన్వీనర్ మోతె రాజిరెడ్డి, మానేరు నీటి సంఘాల మాజీ చైర్మన్ వంగ సురేందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు లక్కిరెడ్డి కమలాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

చందుర్తి: మండలంలోని మర్రిగడ్డ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రెడ్డి సంఘం అధ్యక్షుడు దూది శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ దారం కావ్యశ్రీ, ఉపాధ్యక్షుడు ఎగమల నాగరాజిరెడ్డి, కార్యదర్శి నాయిని బాపురెడ్డి పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలంలోని తడగొండ గ్రామ రెడ్డి సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గుడి శేఖర్‌రెడ్డి, సభ్యులు ఉన్నారు.

ఏ ఆపద వచ్చినా '100' కు డయల్ చేయండి



సుద్దాలలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కోనరావుపేట: అన్ని రకాల ఆపదల నుంచి 100 నెంబర్‌కు డయల్ చేసి సాయం పొందవచ్చని ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని సుద్దాలలో మంగళవారం సాయంత్రం 100 డయల్‌పై అవగాహన కార్యక్రమంలో ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. ఎలాంటి అత్యవసర పరిస్థితి ఏర్పడినా 100 నెంబర్‌కు డయల్ చేస్తే తక్షణమే పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి సాయం అందిస్తామన్నారు. సర్పంచ్ దేవలక్ష్మి, ఉప సర్పంచ్ నాగరాజు పాల్గొన్నారు.

యువత మత్తులో పడొద్దు

వేములవాడరూరల్: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను పాడుచేసుకోవద్దని వేములవాడ రూరల్ ఎస్ఐ మారుతి అన్నారు. మంగళవారం మాట్లాడుతూ కష్టపడి తల్లిదండ్రులు ఉన్నత చదువులు చదివిస్తున్నారని, మంచి చదువులు చదువుకుని ఉన్నత ఉద్యోగాల్లో పోటీ పడాలన్నారు. ఎక్కడైనా గ్రామాల్లో గుడుంబా, మత్తు పదార్థాలు అమ్మినట్లయితే సమాచారం అందించాలని కోరారు.

చొప్పదండిలో ఎగిరేది బీఆర్ఎస్ జెండానే

- చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



రవీందర్‌రావుతో ఎమ్మెల్యే రవిశంకర్

బోయినపల్లి: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ముచ్చటగా మూడోసారి చొప్పదండిలో ఎగిరేది బీఆర్ఎస్ జెండానేనని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. టికెట్ ఖరారు అయిన సందర్భంగా మండలంలోని కొదురుపాక గ్రామంలో రాష్ట్ర సీనియర్ నాయకులు జోగినిపల్లి రవీందర్‌రావును ఎమ్మెల్యే రవిశంకర్ మంగళవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను రవీందర్‌రావు అభినందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ హేజోబు రవిచందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, వైస్ఎంపీపీ నాగయ్య, మేడుదుల మల్లేశం, బత్తిని కమల్ పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో మహిళలకు రక్షణ కరువు

- ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వాజి విమల



మాట్లాడుతున్న విమల

సిరిసిల్లటౌన్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పాలనలో మహిళలకు రక్షణ కరువైందని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వాజి విమల అన్నారు. మంగళవారం సిరిసిల్ల బీవైనగర్‌లోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కూడా రక్షణ కరువైందన్నారు. దేశ వ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న అరాచకాలను కేంద్ర సర్కారు అరికట్టాలని లేకుంటే రాబోయే ఎన్నికల్లో పరాభవం తప్పదని హెచ్చరించారు. ఆమె వెంట జిల్లా అధ్యక్షురాలు సూరం పద్మ, గట్ల స్వప్న, రూప తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

ప్రభుత్వ ఆసుపత్రిలో దంత వైద్యసేవలు

గంభీరావుపేట: ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో దంత వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాసుపత్రి సూపరింటెండెంట్, దంత వైద్యాధికారి శ్రీనివాస్ కోరారు.

రైతులకు బీపీ, షుగర్ పరీక్షలు

గంభీరావుపేట: మండల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక పాల కేంద్రం దగ్గర పాడి రైతులకు మంగళవారం బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు.

ఎమ్మెల్యేను కలిసిన బోయినపల్లి ఎంపీపీ

బోయినపల్లి: చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను మంగళవారం ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఏఎంసీ చైర్మన్ లెంకల సత్యనారాయణరెడ్డి, పలు గ్రామాల సర్పంచులు క్యాంపు కార్యాలయంలో కలిశారు.

ఆరాధనోత్సవం

ఎల్లారెడ్డిపేట: స్థానిక సత్సంగ సదనంలో భక్త శ్రీశ్రీ సరస్వతీగోవిందరాజుల ఆరాధన దినోత్సవాన్ని మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఏఎంసీ చైర్మన్‌కు సన్మానం

ఎల్లారెడ్డిపేట: మండలం రాచర్లబొప్పాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఇటీవల నియమితులైన ఎలుసాని మోహన్‌కుమార్‌ను ఎస్ఆర్ఐ రాధారపు సత్యం ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు.

గద్దర్‌కు నివాళి

కోనరావుపేట: మండలంలోని వెంకట్రావుపేటలో ప్రజానౌక గద్దరన్న యాదిలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మంతెన సంతోష్, ఎంపీటీసీ పల్లె మంజుల రవీందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ మ్యాకల భూమయ్య, నాయకులు పాల్గొన్నారు.

చల్మెడను కలిసిన సర్పంచులు

చందుర్తి: మండల సర్పంచుల ఫోరం కన్వీనర్ ఆయిల్నేని కమలాకర్ ఆధ్వర్యంలో మండలంలోని సర్పంచులు బీఆర్ఎస్ వేములవాడ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావును కరీంనగర్‌లో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

కార్మికుడి కుటుంబానికి ఆర్థికసాయం

ఎల్లారెడ్డిపేట: అనారోగ్యంతో మృతిచెందిన గ్రామ పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్ రేసుబాబు కుటుంబానికి స్థానిక పవర్‌యూత్ సభ్యులు రూ.10 వేల నగదు, 50 కిలోల బియ్యం అందజేశారు.

సభకు తరలిరండి

చందుర్తి: మణిపూర్ మహిళపై ఆకృత్యాలకు వ్యతిరేకంగా సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 25 ఉదయం 11 గంటలకు నిర్వహించే వ్యతిరేక ప్రదర్శన సభకు తరలిరావాలని సంస్కృతిక సమైక్య జిల్లా అధ్యక్షుడు గుండా థామస్ పిలుపునిచ్చారు. స్థానిక రాజీవ్‌గాంధీ విగ్రహం ఎదుట కరపత్రాన్ని మంగళవారం ఆవిష్కరించారు.

మల్టీపర్పస్ కార్మికుడి మృతి

వీర్నపల్లి: మండలంలోని బంజేరు గ్రామపంచాయతీలో మల్టీపర్పస్ కార్మికుడిగా పనిచేస్తున్న ఎడల శంకర్(48) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

కోనరావుపేట: ప్రభుత్వం 2023 జూలై 1 నుంచి పీఆర్సీ కమిటీని నియమించి మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని టీపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు నూగూరి దేవేందర్ అన్నారు.

బీజేపీ మండల కార్యదర్శిగా తిరుపతి

కోనరావుపేట: బీజేపీ కోనరావుపేట మండల కార్యదర్శిగా ధర్మారం గ్రామానికి చెందిన ఆసరి తిరుపతి నియమించినట్లు మండల శాఖ అధ్యక్షుడు గొట్టె రామచంద్రం ఒక ప్రకటనలో తెలిపారు.

సమాచారం

నేడు వృద్ధాశ్రమంలో న్యాయ విజ్ఞాన సదస్సు

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి ప్రభుత్వ వృద్ధాశ్రమంలో బుధవారం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం 2 గంటలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నట్లు చైర్మన్ జస్టిస్ ప్రేమలత ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

వేములవాడరూరల్/కోనరావుపేట: వేములవాడ సబ్ డివిజన్ పరిధిలోని బోయినపల్లి రైతు వేదికలో బుధవారం విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు సెస్ ఏఈ నగేశ్, దివ్య వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. వేములవాడ టౌన్, వేములవాడ రూరల్, కోనరావుపేట, చందుర్తి, బోయినపల్లి మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు సమావేశానికి హాజరై సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే ఈ సమావేశానికి సీజీఆర్ఎఫ్–2 నిజామాబాద్, చైర్మన్ కె.ఈశ్వరయ్య హాజరవుతున్నట్లు వారు తెలిపారు.

వాహన తనిఖీలు



తనిఖీ చేస్తున్న పోలీసులు

కోనరావుపేట: కోనరావుపేట మండలం మర్తనపేట, కొలనూర్ గ్రామాల్లో వాహనాల తనిఖీ చేపట్టారు, ఈ సందర్భంగా వాహనదారుల వద్ద ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. పత్రాలు సరిగా లేని వాహన యజమానులకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా సీఐ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా వాహనానికి సంబంధించిన డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ పత్రాలు తప్పకుండా ఉండాలన్నారు. వాహనాన్ని నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఆయన వెంట ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

వృద్ధాశ్రమంలో ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం



వృద్ధాశ్రమంలో వృద్ధులను సన్మానిస్తున్న ఆర్డీవో

తంగళ్లపల్లి: ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని మంగళవారం మండెపల్లి ప్రభుత్వ వృద్ధాశ్రమంలో ఎలక్షన్ స్వీప్ అధికారుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులను శాలువాలతో సత్కరించి పండ్లు అందజేశారు. అనంతరం ఓటుహక్కు వినియోగంపై వృద్ధులకు అవగాహన కల్పించారు. వీవీ ప్యాట్‌లో ఓటు వేసే విధానాన్ని తెలియజేసి వారిచే మోడల్ ఓటు వేయించారు. ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీవో ఆనంద్‌కుమార్, స్వీప్ నోడల్ అధికారి నర్సింహులు, డీడబ్ల్యూవో జిల్లా అధికారి లక్ష్మీరాజం, సఖీ ప్రాజెక్ట్ మేనేజర్ రోజ, వృద్ధాశ్రమం కోఆర్డినేటర్ మమత, సీడీపీవోలు పాల్గొన్నారు.

న్యాయవాదులకు హెల్త్‌కార్డులు



హెల్త్‌కార్డులు అందిస్తున్న రాజ్‌కుమార్

సిరిసిల్లటౌన్: న్యాయవాదుల సంక్షేమానికి రాష్ట్ర అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్టు నిరంతరం కృషి చేస్తుందని ట్రస్టు సలహామండలి సభ్యుడు పి.వి.రాజ్‌కుమార్ అన్నారు. ట్రస్టు ద్వారా మంజూరు చేసిన హెల్త్ కార్డులను మంగళవారం జిల్లా న్యాయవాదులకు అందజేసి మాట్లాడారు. ఈ కార్డు ద్వారా ప్రతి న్యాయవాదికి రూ.2 లక్షల వరకు వైద్య ఖర్చులు ఉచితంగా అందుతాయని, రాబోవు రోజుల్లో రూ.5 లక్షలకు పెంచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడి లక్ష్మన్, ప్రధాన కార్యదర్శి ఎస్.అనీల్‌కుమార్, పెంట శ్రీనివాస్, సురేశ్, సత్యసాయిరాం పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
సిరిసిల్ల జిల్లా:
9951602934, 9010610963
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
సిరిసిల్ల : రఘు - 7331119957
వేములవాడ : నవీన్ - 7997958211
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899